# మామూలు మనిషి

అప్పుడే ఉత్తరం వచ్చింది. శారద తల్లికి రాసింది, సరస్వతిని పట్నం పంపించమని, ఒకటి రెండునెలలు తన దగ్గర వుంటే తనకు సహాయంగా వుంటుందని. శారద పెళ్ళై రెండేళ్ళయింది. ఇప్పుడు గర్భవతిగా వుంది. ఒక్కత్తే పట్నంలో ఒంటరిగా పని చేసుకోలేకుండా వుంది. సరస్వతి ఊరికనే వుందిగదా! పట్నం వస్తే తనకు పనికి సహాయంగా వుంటుంది. ఇంట్లోనూ తోడుగా వుంటుంది. అందుకే రమ్మని జాబు వ్రాసింది ఉత్తరం రాగానే తల్లి సరస్వతిని ప్రయాణం చేసింది. సరస్వతి మూతి ముడుచుకు కూర్చుంది. దానికి అక్క అంటే అసూయ, కోపం! అక్కను బి.ఏ. దాకా చదివించారు. తరువాత పదివేలు కట్నం యిచ్చి ఒక మంచి కాలేజి లెక్చరర్‌ను చూసి పెళ్ళి చేశారు. అప్పుడే వాళ్ళ నాన్న రిటైరయ్యారు. సంపాదన తగ్గిపోయింది. అంచేత మగ పిల్లలను చదివించటానికే డబ్బు చాలటంలేదని సరస్వతిని చదువు మాన్పించారు. ఎప్పటికయినా పెళ్ళి చేస్తాము కదా! ఇంక చదువు ఖర్చుకూడా ఎందుకని చదువు మాన్పించారు. సరస్వతి ఇంటర్ ఫస్ట్ క్లాసులో పాసయింది. దానికి చదువుకోవాలని చాలా సరదా! మూడు రోజులు నిరశన వ్రతం చేసి, ఏడ్చి, మొత్తుకుని చదువు కుంటానని పట్టుబట్టింది. కాని ఆర్థిక పరిస్థితి బాగాలేని అమ్మా, నాన్నా చదివించటానికి సిద్ధపడలేదు. కొన్నాళ్ళకి ఇంక చేసేదిలేక నిరాశతో ఊరు కుంది. కొన్నాళ్ళు కాలేజికి వెళ్ళే పిల్లలందరిని అసూయతో చూస్తూ వుండేది. ఇప్పుడు అదీ ఓపిక లేక మానుకుని తన లోకంలో తాను వుంటోంది.

రెండేళ్ళయింది. సరస్వతికి పెళ్ళి ప్రయత్నాలుకూడా ఏమీ జరగటం లేదు. ముందు కట్నం డబ్బు చూసుకోవాలి గదా! తరువాత పెళ్ళి ప్రయత్నాలు. ఆ డబ్బు అంది రావటం లేదు. రోజులు గడిచి పోతున్నాయి. సరస్వతికి పొద్దున్నే లేస్తే సాయంత్రం దాకా ఏమీ పొద్దుపోదు. అదృష్ట వశాత్తు పక్కింట్లో సరోజ చదువు మానేసి హాయిగా సంగీతం నేర్చు కుంటోంది. వాళ్ళకు బాగా డబ్బుంది. ఆ పిల్లకూ ఏమీ పొద్దుపోదు. అంచేత అన్ని రకాల పత్రికలు కొంటుంది. అవి తను చదివేశాక సరస్వతికిస్తుంది. అంచేత కాస్త పొద్దుపోతుంది. అన్ని రకాల సీరియల్ నవలల గురించి సరోజకు, సరస్వతికి గంటలు గంటలు సంభాషణ జరుగుతూ వుంటుంది. ఇద్దరికి పొద్దుపోతుంది. అయితే ఇద్దరూ సీరియల్ నవలలు, ఇతర నవలలు తప్ప ఇంకేమీ చదవలేదు. వేరే పుస్తకాలు కూడా చదువవచ్చునన్న ఆలోచన వారికెప్పుడూ రాలేదు. సరోజ, సరోజతల్లి రోజుమార్చి రోజైనా తప్పకుండా సినిమాకు వెళతారు. సరస్వతిని సినిమాకు ఎవరూ పంపరు. కాని ఏడ్చి గోలపెట్టి వారానికొకసారైనా సరోజ వాళ్ళతో తనూ వెళుతుంది. ఇంతైనా జీవితం విసుగు పుడుతూనే వుంది. ఒక్కొక్కసారి ఏమీ తోచదు.

సరస్వతికి అక్క అంటే కోపం. అక్క రమ్మంది అనగానే తనకు వెళ్ళాలని లేదు. మొదట నేను పోను అని మెండికెత్తింది మళ్ళా తనే ఆలోచించుకుంది. ఇక్కడ ఏం పొద్దుపోతోంది! పట్నం వెళితే కాస్త మార్పుగా వుంటుందేమో! కొత్తచోటుగదా! పైగా బావ మంచివాడు. కబుర్లు చెపుతూ వుంటాడు. తీరిక వుంటే గవ్వలు ఆడుతాడు. సినిమాకు తీసుకు వెళతాడు. ఇవన్నీ ఆలోచించుకుని అక్కమీద కోపం తగ్గించుకుని ప్రయాణానికి మెత్తబడింది. ఆదివారం సాయంత్రం ఎక్స్‌ప్రెస్‌లో సరస్వతి పట్నం వస్తోందని, స్టేషనుకు వచ్చి ఇంటికి తీసుకెళ్ళమని శారదకు ఉత్తరం రాశారు. ఆదివారం ప్రయాణం ఖాయమైంది.

ఆదివారం రైల్లో ఎక్కినప్పుడు పెట్టెనిండా జనం వున్నారు. సరస్వతికి కూచోడానికికూడా చోటు లేదు, ఒక మూల ఒదిగి కూర్చుంది. తను ఎప్పుడూ ఒంటరిగా ప్రయాణం చెయ్యలేదు. ఏదో భయంగా వుంది, సరదాగానూ వుంది. ముప్పావలా పెట్టి ఒక పత్రిక కొనుక్కుంది. అందులో కథలు చదువుతూ తల దాచుకు కూర్చుంది. రైలు శరవేగంతో పోతోంది. ఒక్కొక్క స్టేషనులో ఆగినప్పుడు జనం ఎక్కుతున్నారు, దిగుతున్నారు. ఒకావిడ సరస్వతిని పలకరించింది. "అత్తవారింటికా?" అంది. సరస్వతి దిగులు ముఖం చూస్తే ఆవిడకలా అనిపించిందేమో! సరస్వతికి చిరాకు వేసింది. ఏమీ మాట్లాడలేదు. ఆవిడ మళ్ళా అడగలేదు. ఆవిడ చుట్టూ పిల్లలు గోలచేస్తున్నారు. ఒంగోలు స్టేషను వచ్చేసరికి పెట్టె కొంచెం ఖాళీ అయింది. పెద్ద పెట్టె. అవతల చివరన ఒకతను కూచుని పేపరు చదువుతున్నాడు. ఇవతల చివరన సరస్వతి కూర్చుని పత్రిక చదువుతోంది. మధ్యలో ఆవిడ నలుగురు పిల్లలతో సందడిగా కూర్చుంది. రైలు పోతున్నంతసేపు ఆ పిల్లలు వేరుసెనక్కాయలు అవీ ఇవీ అన్నీ కొనుక్కొని పెట్టెనిండా చెత్త పోస్తూనే వున్నారు. నెల్లూరు స్టేషను రాగానే ఆవిడా పిల్లలు దిగిపోయారు. మళ్ళా ఎవరూ ఎక్కలేదు. అంత పెట్టెలో ఆ చివరన అతను ఈ చివరన తను. సరస్వతికి భయం వేసింది. తను చూసిన సినిమాలు, చదివిన కథలు అన్నీ గుర్తుకు వచ్చాయి. ప్రతి కథలోను ఒకటే! ఒంటరిగా ఆడది వుంటే మగవాడు మర్యాదగా చూస్తాడా! మగవాడు మంచివాడు కాదు. నరరూపరాక్షసుడు. ఆడదాన్ని చూడగానే అమాంతం మీద పడిపోయి పెద్దపులిలా—బాబోయ్! చీర లాగి, రవిక చింపి, అమ్మో! ఎన్ని సినిమాల్లో చూడలేదు! ఎన్ని కథల్లో చదవలేదు! సమయానికి హీరో వచ్చి చెడా మడా వాయించి, నాలుగు తన్ని ఆదుకుంటాడు. కాని, లేకపోతే ఏమౌతుంది! తలుచుకుంటేనే భయం వేస్తుంది. 'శమంత' నవలలో పాపం ఆ అమ్మాయిని ఎవరో పిలుస్తున్నారని అంతా కలిసి ఊరి బయటికి తీసుకు

వెళ్ళి, అమ్మో! ఘోరం! అయినా అప్పుడే ఫారిన్ నించి తిరిగి వస్తున్న హీరో హేండ్‌బాంగ్‌తో ఆ తోవనే వస్తూ వుండడం, ఆ అమ్మాయి కేకలు వినడం, అంతా అద్భుతం! ఆ నవల ఎంత బాగుంది!

తీరిగ్గా చదివిన నవలలు, చూసిన సినిమాలు అన్నీ జ్ఞాపకం చేసుకునే సరికి సరస్వతికి గుండెల్లో దడ పుట్టింది. ఇంకొక మూడు గంటల పేపు ఈ పెట్టెలో, ఈ వ్యక్తితో ఒంటరిగా ఎలా! ఏమౌతుందో! అతని కేసి తీక్షణంగా చూసింది. ఆ ముఖం మామూలుగానే వుంది. భయంకరంగా లేదు. అతను సరస్వతిని పట్టించుకోవటం లేదు. ఏదో చదువుకుంటూ వున్నాడు. అయినా సరస్వతికి ఊరట కలుగలేదు. ఆత్మరక్షణ కోసం ఏదైనా చెయ్యాలని వణికిపోతూ ఆలోచిస్తోంది. ఏమీ తోచలేదు. మళ్ళా స్టేషను వచ్చేవరకు బాత్‌రూమ్‌లోకి పోతే! ఆలోచన బాగానే వుంది. బాత్‌రూంలోకి వెళ్ళి లోపల గడియ వేసుకుని అక్కడ నిలుచుంది. ఇప్పుడు సురక్షితంగా వున్నాననుకుంది. పది నిమిషాలు అలాగే వుంది. మళ్ళా స్టేషను వచ్చేదాకా ఇక్కడే ఉండాలి. స్టేషను వస్తే దిగిపోవాలి అనుకుంది. కాని లోపల గాలి లేదు. కిటికీ తెరవబోతే రాలేదు. ఊపిరాడక కాస్సేపటికి మళ్ళా బయటికి వచ్చింది. ఒక మూల ఒదిగి కూర్చుంది. అతను లేచి దగ్గరగా వచ్చాడు "పేపరు చదువుతారా?" అంటూ పేపరు అందివ్వబోయాడు. వణికిపోతున్న తనకు నోట మాట రాలేదు బెదరిపోయి చూస్తూ ఊరుకుంది. అతను పేపరు అక్కడ పెట్టి బాత్‌రూంలోకి వెళ్ళాడు. మళ్ళా వచ్చి సరస్వతికి కాస్త దూరంగా కూర్చున్నాడు. అవసరానికి వెతుక్కోకుండా సరస్వతి అలారమ్ చైన్ ఎక్కడుందో చూసి గుర్తుపెట్టుకుంది. "పట్నంలో ఏ పేటకు వెళతారు మీరు? మీ వాళ్ళు స్టేషనుకు వస్తారా?" అన్నాడతను. అనవసర ప్రశ్నలు దేనికి! ఏదో మాటలు కలపాలని! సరస్వతి జవాబు చెప్పలేదు. ముడుచుకు కూర్చుంది.

గూడూరు స్టేషను వచ్చింది. అతను దిగి వెళ్లాడు. 'అమ్మయ్య' అనుకుంది. రైలు కదలబోతూ వుంటే మళ్ళా వచ్చాడు. "అయ్యో!" అనుకుంది. తనైనా దిగి వేరే పెట్టెలోకి వెళ్ళవలసింది అనుకుంది. దేవుడిమీద భారం వేసి కిటికీలోంచి దిక్కులు చూస్తూ కూర్చుంది. అతను తనకు కాఫీ తెచ్చి యిచ్చాడు. తాగాలని లేదు. అయినా తల నొప్పిగా వుంది. మెదలకుండా తీసుకు తాగింది. అతను కాఫీకి డబ్బులు ఇవ్వగానే రైలు కదిలింది అతను ఓ మూలకు వెళ్ళి కూర్చుని మళ్ళా చదువు మొదలుపెట్టాడు. సరస్వతి మనసులో రామ భజన మొదలు పెట్టింది.

రైలు మెల్లగా చీకటి పడుతూవుంటే పట్నం చేరింది. గండం గడిచినట్లు సంతోషంగా సరస్వతి చేతి పెట్టెతో బయట పడింది. కాని అక్క, బావ ఎవరూ రాలేదు స్టేషనుకు. బిక్క మొహంతో దిక్కులు చూస్తూ నిలుచుంది కాస్సేపటికి అతను దిగి వచ్చాడు చేతిలో చిన్న సంచీ తప్ప అతనికి ఏమీ సామాను లేదు. దిగులుపడుతున్న సరస్వతిని చూసి వెళ్ళిపోకుండా ఆగాడు. "మీ వాళ్ళు ఎవరూ రాలేదా? నాతో రండి నేను దిగబెడతాను. ఎటు వేపు వెళ్ళాలి?" అన్నాడు. దిగులుతో వున్న సరస్వతి ఒక్క క్షణం భయం మరిచిపోయింది. "మాంబళం వెళ్ళాలి, మా బావ రావాలి" అంది దిగులుతో కాస్సేపు చూశారు. జనం అంతా వెళ్ళి పోతున్నారు. సరస్వతి కోసం ఎవరూ రాలేదు. అప్పుడు అతను మళ్ళా అన్నాడు, "ఫర్వాలేదు. నాతో రండి. మీకు అడ్రసు తెలుసుగదా! నేను దిగబెడతాను. నేనూ మాంబళమే వెళ్ళాలి." సరస్వతికి గుండెల్లో పీకుతోంది. ఒంటరిగా వెళ్ళటానికి తనకు తోవ తెలీదు. ఇతనితో ఒంటరిగా వెళ్ళవచ్చో వెళ్ళకూడదో ఆలోచిస్తోంది. అతను మళ్ళా అన్నాడు. "మీరు రండి బస్‌లో వెళదాం! మీకూ సామాను ఏమీ లేదుగదా!" అప్పటికి సరస్వతికి కొంత ధైర్యం వచ్చింది. బస్‌లో చాలా జనం వుంటారు గదా!

ఏమీ ఫరవాలేదనుకుంది. అతనితో వెళ్ళింది. అతను అడ్రసు ప్రకారం ఆమెను ఇంటికి తీసుకువెళ్ళాడు తలుపు తట్టగానే శారద వచ్చి తలుపు తీసింది. సరస్వతిని చూచి తెల్లబోయింది. "వస్తున్నానని రాయనేలేదేమి" అంది. అక్కను చూడగానే అంతవరకు పడుతున్న మథన, బాధ అంతా కలిసి సరస్వతికి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. "ఉత్తరం రాసింది అమ్మ చేరలేదా?" అంది. ఉత్తరం చేరలేదు. శారద సరస్వతి మాట్లాడుకుంటూ వుండగా అతను మెల్లగా జారుకున్నాడు.

"ఇదుగో ఈయన తీరుకు వచ్చారు నన్ను" అని సరస్వతి చెప్పే లోగా అతను అక్కడ లేడు. వాళ్ళ మాటల మధ్య అతను ఎప్పుడో "వస్తానండి" అని వెళ్ళిపోయాడు. వీళ్ళు వినిపించుకోలేదు. అతను కనిపించక పోవటం సరస్వతికి దిగులేసింది. మధ్యాహ్నం నుంచి అతన్ని ఏదో నరరూపరాక్షసుడుగా, ఆడపిల్లను చూడగానే అమాంతం మీదపడే అనాగరికుడుగా, రకరకాలుగా ఊహించుకుంటూ గుండె దడతో బాధపడు తోంది. అతను అతి సామాన్యమైన వ్యక్తిగా, అవసరానికి ఆదుకునే వ్యక్తిగా ప్రవర్తించి ఇప్పుడు కనిపించకపోవటం దిగులుగా వుంది. అతని పేరు తెలియదు, అడ్రసు తెలియదు. అతను ఇంత మంచివాడని అసలే తెలియదు. వయసులో వున్న ఆడపిల్లను మర్యాదగాచూచి జాగ్రత్తగా ఇంటి దగ్గర దిగబెట్టే మగవాళ్ళు కూడా వుంటారని సరస్వతికి అంతవరకు తెలియదు. అల్లాంటి వ్యక్తులను గురించి తాను ఎక్కడా చదవలేదు. తాను చదివిన నవలల్లోగాని, చూసిన సినిమాల్లోగాని రెండు రకాల మగవాళ్లు మాత్రమే వున్నారు. ఒకడు హీరో, ఇంకొకడు విలన్. హీరో అయితే మంచివాడు, కష్టాల్లో ఆదుకుంటాడు, నిర్లిప్తంగా అన్నీ మంచి పనులే చేస్తుంటాడు. నాయకిని కష్టాల్లో ఆదుకున్న తర్వాత ఆమె ఇంటిచుట్టూ తిరుగుతూ చెట్ల చుట్టూ తిరుగుతూ పార్కుల్లో క్రిందపడుతూ లేస్తూ గంతులేస్తూ పాటలు పాడుతూ ఆమెను ప్రేమిస్తాడు. చివరకు కష్టం లేకుండా పెళ్ళి చేసుకుంటాడు. విలన్ అయితే నాయకిని చెరబడతాడు. నానా బాధలు పెడతాడు. అందరిని చంపాలకుని చివరకు తానే చస్తాడు. అతను చస్తేనేగాని సినిమా పూర్తిగాదు. ఇతను ఇంతవరకు ఏమీ

అమానుషంగా ప్రవర్తించలేదు కాబట్టి విలన్ కాడు. తప్పకుండా హీరో అయివుండాలి తన ఇల్లు తెలుసుగా! రేపు అతనే తనను వెతుక్కుంటూ వస్తాడు. ఒకరోజు కాదు, రోజూ వస్తాడు. ఆ ఊహతో ఆమెకు సంతోషం కలిగింది. కళ్లు తుడుచుకుంది. దిగులు పోయింది ఉత్సాహంగా పెట్టె ఒక మూల పెట్టి స్నానానికి వెళ్ళింది.

వారం రోజులు రాత్రిం పగలు సరస్వతి అతని కోసం ఎదురు చూస్తూనే వుంది. వీధివేపు కిటికీలోనే ఆమె మకాం! రెండు కళ్ళు రోడ్డుకు ఒప్పగించి చూస్తూ కూర్చునేది, అతను వస్తాడేమోనని, ఇంట్లో ఏ పనీ చెయ్యదు. అక్కతో మాట్లాడదు రాత్రి పది అయినా కిటికీ వదలదు. సరస్వతికీ వాలకం చూసిన శారదకు ఏమీ పాలుపోలేదు. ఒకవేళ అమ్మా, నాన్నను వదిలి వచ్చి దిగులుపడుతోందేమో అనుకుంది. కాస్త మార్పుగా ఉంటుందని ఆరోజు సాయంత్రం సుందరం థియేటర్‌కు సినిమాకు తీసుకు వెళ్ళింది. శారద, సరస్వతి ఇద్దరే వెళ్ళారు. శారద భర్త ఏదో పని వుందని రాలేదు. హాల్లో కూర్చుని వుండగా అతను ఒక అమ్మాయితో కలిసి వచ్చి వీళ్ళు కూర్చున్న చోటికి కొంచం దూరంగా కూర్చున్నాడు. పరధ్యానంగా వున్న సరస్వతి అతన్ని హటాత్తుగా చూసింది త్రుళ్ళిపడింది. గొంతు పెకలించుకుని మాట సరిచేసుకుంటూ భయం భయంగా మెల్లగా చెప్పింది శారదతో, "అదిగో, అతనే, అతనే ఆ వేళ స్టేషన్ నుంచి నన్ను ఇంటికి తీసుకు వచ్చింది." సరస్వతి ముఖంలో సంతోషం తాండవిస్తోంది. శారద అతనికేసి తేరిపార చూసింది తరువాత నవ్వుతూ అంది. "అతనా? అతను మాకు తెలిసినవాడే! మీ బావ కాలేజీలోనే పని చేస్తున్నాడు. మొన్నీమధ్యనే పెళ్ళి చేసుకున్నాడు. ఆ అమ్మాయి అతని భార్య" అంది.

సరస్వతి ముఖం చిన్నబోయింది. ఇతను హీరో కాదు, విలనూ కాదు. ఒట్టి మామూలు మనిషి. కాస్త అసంతృప్తి కలిగింది. మళ్ళీ తన తెలివి తక్కువకు తానే సిగ్గుపడి నవ్వింది.